# భలే మంచి చౌక బేరము

-ఎ.రాజరాజేశ్వరి

అది స్వప్నలోక్ అపార్ట్‌మెంట్. అంతా కలసికట్టుగా, సఖ్యతగా ఉంటారు. ఉద్యోగస్థులంతా ఆఫీసులకు వెళ్లిపోయాక ఆడవా రంతా తమ తమ పనులు త్వరగా ముగించుకునో, వాయిదా వేసుకునో ఒక చోట చేరుతారు. వారిమధ్య అదీ ఇదీ అని తేడాలేక అన్నిరకాల కబుర్లు దొర్లుతుంటాయి. శ్రీవారి ముచ్చట్లు, వండు కున్న వంటలు, టీవీ సీరియల్స్, సినిమాలు, రాజకీయాలు... వారి మధ్య రాని టాపిక్కే ఉండదు. నవ్వులు, కేరింతలతో ఆ ప్రాంత మంతా మారుమ్రోగుతూ ఉంటుంది.

తెల్లారితే చాలు పక్షితీర్థం పక్షుల్లా ఎక్కడెక్కడినుండో రకరకాల వస్తువులు అమ్ముకునేవాళ్లు అక్కడికి వచ్చి వాలిపోతారు. తమకి పనికొచ్చినా రాకపోయినా గీచి గీచి బేరమాడి సేల్స్‌మాన్ల సహ నాన్ని పరీక్షిస్తూ చాలా చౌకగా వస్తువుని తమ స్వంతం చేసుకుని మురిసిపోతుంటారు. ఇక తిరగలేకనో, సేల్స్ టార్గెట్ పెంచుకోవా లనో సాధారణంగా వస్తువులు అమ్ముకుని వెళ్లడమే జరుగుతుంది.

ఆ గుంపులో నీలిమ, సరళ, రాణి, వసంత, కరుణ, శ్రీదేవిలు కాకుండా లక్ష్మి, శారదలు కూడా ఉన్నారు. సేల్స్‌మాన్‌ని బురిడీ కొట్టించి మరీ వస్తువు పొందినందుకు నలుగురిలోనూ తమ విలువ పెరిగినట్లు మురిసిపోతారు. ఆ గుంపుతోపాటు లక్ష్మి, శారద కలసినా సాధార ణంగా అవసరంలేని వస్తువుల జోలికి వారు వెళ్లరు.

ఇలా పనికిమాలిన వస్తువులు కొని డబ్బులు వేస్ట్ చేయవద్దని చెప్పి చెప్పి వారి భర్తలు విసిగి పోయారు. నయానాభయానా అదిలించినా కూడా వారి బలహీనతను మాన్పించలేక అక్కడ కాపలా ఉండే సెక్యూరిటీ గార్డ్‌తో 'నో ఎంట్రీ ఫర్ సేల్స్‌మాన్' అనే బోర్డు పెద్ద అక్షరా లతో పెట్టించినా ఏం లాభం?

వారటు ఆఫీసుకి వెళ్లగానే పదికీ పరకకీ కక్కుర్తిపడి వారిని చూసీ చూడనట్లు లోపలికి వదిలేస్తారు.

ఆ రోజు వారి వారి భర్తలు ఆఫీసులకు వేంచే సాక యధాప్రకారం అంతా గుమిగూడి మహిళా సభని నిర్వహిస్తున్నారు. కబుర్లు, నవ్వులతో వాతావరణం హోరెత్తిపోతోంది.

ఎవరో ఇద్దరు అపరిచిత వ్యక్తులు వారి ముందు నిలబడేసరికి వారి వాక్ ప్రవాహానికి అంతరాయం కలిగి అంతా నిశ్శబ్దమయిపోయి 'ఎవరు మీరన్నట్లు?' ప్రశ్నార్థకంగా చూసారు.

వారిద్దరూ అమ్మాయిలే. సుమారు ఇరవై పాతిక మధ్య వయసులో ఉన్నారు. అప్పటిదాకా బాగా తిరిగారు కాబోలు మొహంలో చిరుచెమ టలు, అలసట తొంగి చూస్తున్నాయి. వారి చేతిలో బరువుగా వ్రేలాడుతున్న బ్యాగులను చూస్తే వారు సేల్స్‌గరల్స్ అని తెలుస్తూనే వుంది.

వారు తెచ్చిన వస్తువులు ఏమయి ఉంటాయి? అని గృహిణుల మొహంలో ఆతృత తొంగి చూస్తోంది.

"ఎవరు మీరు? ఆ బ్యాగుల్లో ఏము న్నాయి?'' అని కుతూహలంగా అడగడంతో ఆ అమ్మాయి మొహం విప్పారింది.

"నమస్కారమండీ! నా పేరు స్వప్న, ఈమె కల్పన. మేము గోవిందా కంపెనీ వారి తరపు నుండి సేల్స్ ప్రమోట్ చేస్తాం. మా కంపెనీకి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అవి నాణ్య మయినవే కాక ఇతర కంపెనీల ధరలకన్నా చౌక కూడా. మా కంపెనీకి లాభాలకన్నా కస్టమర్ల సంతృప్తే ముఖ్యం. కస్టమర్లనే కాదు మమ్మల్నీ కన్నబిడ్డల్లా చూస్తుంది. అమ్మకాలు పెరిగేకొద్దీ మాకు ప్రోత్సాహక బహుమతులు ఇస్తుంది. అందుకే మమ్మల్ని ఆదరించి అన్నం పెట్టే కంపెనీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తాం''


వారి కష్టాల ఏకరువుకి జాలిపడ్డ రాణి వాళ్లని కూర్చోమని చెప్పి లోపలకు వెళ్లి మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. ఆడవాళ్లు ఆలోచనలో పడ్డారు.

"ఇదివరకెన్నడూ 'గోవిందా' కంపెనీ పేరు విన్నట్టు గుర్తులేదు. కొత్త కంపెనీనా? ఇంతకీ ఏమున్నాయి మీ దగ్గర'' అంది నీలిమ కాస్త ఆతృత కనబరుస్తూ.

"భలేవారండీ! మార్కెట్లో ఎవర్ని అడిగినా మా కంపెనీ పేరే చెప్తారు. మా దగ్గర లేని వస్తువు వుండదు'' అని చిరునవ్వులు ఒలక బోస్తూ బ్యాగు తెరిచి ఒక్కో వస్తువును ప్రదర్శిం చసాగారు. అవి బ్రష్‌లు, టూత్‌పేస్ట్‌లు, కొబ్బరి నూనెలు, దువ్వెనలు లాంటి సాధారణ సామా నులే. వాటి ప్యాకింగ్ స్టయిల్ ప్రముఖ కంపెనీల ఇమిటేషన్‌లా అనిపిస్తున్నాయి. రేట్లు కూడా ఇంచుమించు సమానంగానో, ఇంకొంచెం ఎక్కువగానో ఉన్నాయి.

"ఎవరికేం కావాలో తీసుకోండి మేడమ్! ఒక సారి మా ప్రొడక్ట్ వాడారంటే మళ్లీ మళ్లీ ఇవే కావాలని మాకు ఫోన్లు చేసి మరీ రప్పిస్తారు. తీసుకోండి'' అన్నారు.

ఆ సామాను చూసి మహిళామణులు పెదవి విరిచారు.




"దీనివలన మీకు వచ్చే లాభం ఏమిటి? ఏడాది ఫ్రీ సప్లై అంటే చాలా నష్టంకదా" అంది శ్రీదేవి ఆరాగా.

తాము చెప్పబోయే విషయానికి నాందిగా ఆ అమ్మాయిలు పెదవులు తడుము కున్నారు.

"మేము చెప్పబోయే విషయాన్ని దయచేసి ఒక్క అయిదునిముషాలు ఓపిగ్గా విన్నారంటే మీరింకా ఆశ్చర్యపోతారు" అని తమ సంచీలో నుండి అందంగా లామినేషన్ చేసి ప్రింట్ చేసి వున్న కార్డు తీసారు. దానిమీద 'గోవిందా' కంపెనీ పేరు, ఊరు వ్రాసి ఉంది.

అందరిలో ఆసక్తి చోటు చేసుకుంది 'అందులో ఏముందా?' అని.

ఆ అమ్మాయిలు తమ కంపెనీ స్కీము గురించి చెప్పసాగారు.



"ఇవి ఎక్కడయినా దొరికేవే? వీటి కోసమేనా ఇంత బిల్డప్ లిచ్చారు. రేట్లు కూడా ఎక్కువే ఉన్నాయి. మాకేమీ అవసరం లేదివి" అంది సరళ.

ఆ అమ్మాయిల మొహంలో కంగారు కనిపించింది.

"ఆగండి మేడమ్! ఈ రేట్లు చూసి కంగారు పడకండి. వీటిలో ఏది తీసుకున్నా ట్వంటీ పర్సంట్ డిస్కౌంట్ ఇస్తాం. కావాల్సినవాళ్లు కొనుక్కోవచ్చును. బలవంతమేమీలేదు. అయితే మా కంపెనీ ఈ మధ్యనే సరికొత్తగా టీ తయారీని మొదలుపెట్టింది. ఇది డార్జిలింగ్ టీతో సమానంగానూ, అంత కంటే ఎక్కువ రుచిగానూ ఉంటుంది. దీన్ని ప్రజల్లోకి తేవడా నికి మా కంపెనీ ఒక ప్రయోజనకర మార్గాన్ని ఎన్నుకుంది. ముందుగా యాభైమంది వేల్యూబుల్ కస్టమర్స్‌ని ఎంచుకుని వాళ్లకి మా టీని ఫ్రీగా సప్లై చేస్తాము. ఒక రెండువారాలు మీరు వాడి చూసి మేము వచ్చినప్పుడు మా టీ గురించి మీ అభి ప్రాయం చెప్పాలి. ఈ టీ పొడి నచ్చిందంటే ఒక సంవత్సరం పాటు మా కంపెనీ మీకు ఉచితంగా సప్లై చేస్తుంది. ఒకవేళ మీకు నచ్చలేదనిపిస్తే మాకు నిరభ్యంతరంగా మీ అభి ప్రాయం చెప్పి ప్రస్తుతం మీరు వాడే కాఫీకానీ, టీగానీ ఏద యినా సరే మా కంపెనీ స్వంత ఖర్చులతో మీకు ఫ్రీగా సప్లై చేస్తుంది."

మహిళల రియాక్షన్ కోసం ఆ అమ్మాయిలు రెండునిము షాలు మాటలు ఆపారు.

వారు ఊహించినట్లే అందరి మొహాల్లో చెప్పలేనంత ఆశ్చర్యం! లోకంలో ఎక్కడైనా ఇంత పిచ్చివాళ్లు ఉంటారా? అన్న అపనమ్మకం పోటీ పడసాగాయి.

'ఏనుగు చచ్చినా బ్రతికినా ఒకటే విలువ అన్నట్లు వాళ్ల కంపెనీ బ్రాండ్ నచ్చినా నచ్చకపోయినా సంవత్సరంపాటు ఫ్రీ సప్లై. అంటే ఆ కంపెనీ వాడెవడో త్వరలో నెత్తిన బట్టేసుకో వడం ఖాయం' అనుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ


"ఇంతవరకూ మా గోవిందా కంపెనీ తయారు చేసిన ఉత్పత్తులన్నీ ఒక ఎత్తయితే ఇప్పుడు కొత్తగా తయారుచేసిన ఈ చాయ్ పొడరు మార్కెట్లో విడుదల చేసి సక్సెస్ కావాలని ప్రెస్టీజియస్‌గా తీసుకుంది. దీని గురించి జనాలకు తెలియాలంటే టీవీ, రేడియో, పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రచారం కావాలి. అందులో నటించే నటులకు పారితోషికం కోట్లు ఇచ్చుకోవాలి. అదీ కాక తమ ప్రకటన ప్రమోట్ చేసినందుకు మీడియా వారికి ఫీజు చెల్లించాలి. తీరా అంత డబ్బు ఖర్చు పెట్టి మార్కెట్లో విడుదల చేసాక ఈ ప్రోడక్టు కస్టమర్స్‌కి నచ్చక తిరస్కరిస్తే మా కంపెనీకి కోట్లలో నష్టం వస్తుంది.

అందుకని మా కంపెనీ అన్నివిధాలా ఆలోచించి కొత్త పథకం ఎన్నుకుంది. దీనివలన అది లాభపడడమేకాదు, తమ టీ పొడిని కొత్త పంథాలో జనానికి పరిచయం చేస్తూ ప్రతి ఊరిలో యాభైమంది అదృష్టవంతుల ఇంటి తలుపు తట్టాలని నిర్ణయించుకుంది. దీనివలన ఇరువర్గాలు లాభపడతాయి. తక్కువ ఖర్చుతో మా సేల్స్ పెరగడమే కాకుండా అదృష్టలక్ష్మి వరించినవారు కూడా చాలా లాభపడతారు. దీని ప్రకారం టీ పొడరు ఒక సంవత్సరంపాటు ఫ్రీగా అందుకోవడమే కాదు, మా ప్రచారంలో భాగంగా వారి వారి ఇష్టానుసారం ఎటువంటి కండిషన్లు లేకుండా వారికి నచ్చే బహుమతులు ఎంచుకునే అవకాశం కూడా అందజేస్తుంది. ఎవరికి ఎన్ని బహుమతుల[illegible]తీసు[illegible]వచ్చును.



## తమన్నా టాలెంట్

ఐశ్వర్యారాయ్ నటించిన 'తాల్' సినిమా హిట్టన్న సంగతి అందరికీ తెలుసు. అలాగే అందులో 'తాల్ సే తాల్ మిలా' అనే పాట ఇంకా హిట్. తమన్నా చదువుకునేటప్పుడు ఓసారి కాలేజీ ఫంక్షన్‌లో ఈ 'తాల్' పాటకి డాన్స్ చేసిందిట. అందరూ ఆమె టాలెంట్‌ని అప్పుడు తెగ పొగిడేరట. అంతేకాదు, ఆ మర్నాటి నుంచీ 'తాల్ తమన్నా' అంటూ సరదాగా పిలిచేవారట. అంటే తమన్నా అంత బాగా డాన్సు చేస్తుందన్నమాట.




మా కంపెనీ మీరు ఎన్నుకున్న వస్తువులు, మీ ఇంటికి చేర్చే బాధ్యత మా డిస్ట్రిబ్యూటర్‌కి అప్పజెప్పింది. ట్రాన్స్‌పోర్టు చార్జీలు డిస్ట్రిబ్యూటర్ భరించుకోవడానికి సిద్ధంగా లేడు. ఎందుకంటే ఇది కొత్త ప్రోడక్టు కాబట్టి, ట్రాన్స్‌పోర్ట్ కస్టమర్లే భరించాలని కండిషన్ పెట్టాడు. అందుకే నామమాత్రంగా వారు తీసుకునే వస్తువుల విలువనుబట్టి మేము రుసుము వసూలు చేస్తాం"

వారి వాగ్దాటికి ఆడవారంతా మంత్రముగ్ధుల్లా మారిపోయారు. కంపెనీ వారిచ్చే బహుమతులు ఏమయి ఉంటావా? అని వారి మొహాల్లో ఆత్రుత, కుతూహలం తొంగి చూస్తున్నాయి.

వారి కుతూహలాన్ని క్రీగంట గమనిస్తున్న అమ్మాయిలు మళ్లీ మొదలు పెట్టారు.

"మా కంపెనీ వస్తువుల విలువనుబట్టి నాలుగు గ్రూపులుగా విభజించింది.

గ్రూపు 'ఎ'లో ప్రెషర్‌కుక్కర్, వాటర్‌ఫిల్టర్, మిక్సీ, వెట్‌గ్రైండర్ వస్తాయి. ఈ వస్తువులు ఏవి కావాలనుకున్నా ప్రతి ఒక్కదానికీ రెండువందల యాభై మాత్రమే రిజిస్ట్రేషన్ కమ్ ట్రాన్స్‌పోర్టు చార్జీ.

గ్రూపు 'బి'లో వాషింగ్ మిషన్, ఫ్రిజ్, కలర్ టీవీ, డివిడిలు ఉంటాయి. ఇవి కావాలనుకుంటే కేవలం అయిదువందలు కడితే చాలు.

గ్రూపు 'సి'లో కారు, మోటారుబైక్, ఫ్లాస్మా టీవీ పెద్ద సైజుది, వంద గ్రాముల బంగారం. ఏ వస్తువుకయినా వెయ్యిరూపాయలు కడితే మీ స్వంతమవుతాయి.

ఇక ఆఖరుది బంపర్ ఆఫర్ గ్రూప్ 'డి'లో. మా స్వంత ఖర్చులతో ఫారిన్ ట్రిప్, రెండువందల గజాల ప్లాటు, టీవీలో నటించే ఉత్సాహం ఉన్నవారికి మా కంపెనీ తన స్వంత ఖర్చుతో శిక్షణ ఇప్పించి ప్రముఖ టీవీ ఛానల్స్‌లో యాంకర్స్‌గాగానీ, నటులుగాగానీ వారి ఇష్టాన్నిబట్టి ప్రవేశం లభిస్తుంది. దీనికి పదిహేనువందలు కడితే చాలు. మీరు కోరుకున్న వస్తువులు రెండు వారాల్లో మీ గుమ్మంలో వాలుతాయి."

రకరకాల వస్తువులు వారిని ప్రలోభ పెడుతున్నా డబ్బు కట్టాలనేసరికి మొహమొహాలు చూసుకున్నారు.

రకరకాల అనుమానాలు కలుగుతూ వారి మొహంలో రంగులు మారాయి.

"మీరేమీ మమ్మల్ని అనుమానించాల్సిన పనిలేదు మేడమ్. మా డిస్ట్రిబ్యూటర్‌కి ఫోన్ చేస్తాను. ఈ స్కీము నిజమో కాదో కనుక్కుని మీ డౌట్లన్నీ తీర్చుకున్నాకనే మా స్కీములో చేరండి. ఇదిగో ఈ రసీదు బుక్కు చూడండి. నమ్మకం ముఖ్యం దేనికైనా. ఇప్పటికి ముప్పయిమంది సభ్యులు మా స్కీములో చేరారు. ఇంకా ఇరవైమంది అదృష్టవంతులు మాత్రమే మిగిలారు. అందరూ సభ్యులయ్యాక ఒక్కసారే మా కంపెనీకి తెలియజేస్తే ఆ లిస్టు ప్రకారం సామాను మా డిస్ట్రిబ్యూటర్‌కి పంపిస్తుంది."

ఆడవారి మొహాల్లో ఆశ నిరాశలు దోబూచులాడసాగాయి. ఇంతవరకూ వారికి ఇటువంటి అనుభవం ఎదురుకాలేదు.

నమ్మి డబ్బు కడితే మోసపోతామని అనుమానం. వద్దు పొమ్మంటే సిరిరా మోకాలు అడ్డం పెట్టినట్లవుతుంది.

ఏం చేయాలో వారు నిర్ణయించుకోలేక పోతున్నారు. తమలో తాము

తర్జనభర్జనపడసాగారు.

వారి ఫీలింగ్స్ గమనించిన కల్పన తన సెల్ నుండి డిస్ట్రిబ్యూటర్‌కి ఫోను చేసి వారికిచ్చింది.

"మా సార్ లైన్‌లో వున్నారు. మీ అనుమానాలు అన్నీ తీర్చుకోండి" అంటూ.

ఒకరి తరువాత ఒకరు ఫోనులో మాట్లాడి తమ మనసులోని అనుమానాలన్నీ తీర్చుకుని "ఇందులో మోసంలేదు. తమకి ట్రాన్స్‌పోర్టు చార్జీతప్ప ఇంక ఎలాంటి ఖర్చు ఉండదు. ఈ స్కీము నమ్మతగినదే" అని ఏకగ్రీవ నిర్ణయానికి వచ్చారు.

టీవీలో నటించాలని, యాంకరింగ్ చేయాలని ఎప్పటినుండో కలలు కంటున్న వసంత చటుక్కున లేచి తనకు పట్టబోయే అదృష్టానికి మురిసిపోతూ ఎప్పటినుండో తను దాచి పెట్టుకున్న పదిహేనువందలు తెచ్చి స్వప్న చేతికిచ్చింది.

"రాబోయే కాలానికి కాబోయే మహానటికి మా శుభాకాంక్షలు. రెండువారాల్లో ఆశా టీవీవాళ్లు మిమ్మల్ని కాంటాక్టు చేస్తారు. ఈ రసీదు జాగ్రత్తగా పెట్టుకుని వారడిగినప్పుడు ఇది చూపించాలి" అంది స్వప్న.

వసంత చొరవ చూపించిన తరువాత ఒకరి తరువాత ఒకరు లేచి తమకి కావాల్సిన వస్తువుల లిస్టు చెబుతూ డబ్బులు కట్టసాగారు. నీలిమ, శ్రీదేవి, అప్పు చేసి మరీ డబ్బు కట్టేసారు.

కొంతమంది చౌకగా వస్తున్నాయికదాని రెండు మూడు వస్తువులు కూడా ఎంచుకుంటుంటే లక్ష్మి, శారద వారించాలని చూసినా వారు వినిపించుకోకపోవడంతో మౌనం వహించారు.

వారిద్దరూ తీసుకోకపోవడంతో "మీరేమీ తీసుకోలేదు. తీసుకోండి మేడమ్. మీ ఫ్రెండ్స్ అంతా ఈ క్షణం నుండి అదృష్టవంతులవుతున్నారు" అన్నారు.

శారద అయిష్టంగా తలూపింది.

"మా ఇంట్లో ఒప్పుకోరు. అన్నీ ఉన్నాయి. నాకేమీ వద్దు" అంది.

"అప్పుచేసి కొనేదిలేదు. మా ఆయనకి లెక్కలు చెప్పాలి. నాక్కూడా వద్దు" అని లక్ష్మి తేల్చేసింది.

"వీళ్లందర్నీ చూసిన తరువాత ఇంటికొచ్చే లక్ష్మిని కాదన్నామని మీరే అనుకుంటారు. ఇంకెవరైనా ఉన్నారా మేడమ్ వస్తువులు తీసుకున్నవాళ్లు" అని డబ్బులిచ్చిన వారందరికీ టీపాట్లు పంచసాగారు.

కరుణ, సుధ లేచి ఇంటి స్థలానికి, కారుకి డబ్బు కట్టేసారు. రాణికి కసిగా ఉంది.

ఎప్పటినుండో నెక్లెస్ కొనమని మొగుడిని పోరుతోంది. 'అదిగో...ఇదిగో' అంటాడుగానీ డబ్బులు విదల్చడు. 'నువ్వు కొనేదేమిటి? వంద గ్రాముల బంగారంతో నేనే బోలెడు నగలు కొనుక్కుంటాను" అని రాణి కూడా ఇంటి ఖర్చులకు ఇచ్చిన డబ్బుల్లో దాచుకున్నది తెచ్చి రసీదు తీసుకుంది.

"మీరందరూ లక్కీ మెంబర్స్ అయినందుకు చాలా థాంక్స్ మేడమ్. రెండువారాల్లో మీ సామాను మీకు చేరుతుంది. రసీదులు జాగ్రత్తగా దాచుకోండి అంతవరకూ. ఇక మేము వెళ్లొస్తాం" అంటూ దాదాపు పదివేలకు పైగా డబ్బు కలెక్ట్ అయినందుకు వారెంతగానో సంతోషించి ఆనందంగా వెళ్లిపోయారు.

తాము పొందబోయే వస్తువుల గురించీ మురిసిపోతూ ఆకలిదప్పులు కూడా మరచిపోయి నవ్వులు కేరింతలతో చాలాసేపు గడిపేసారు. లక్ష్మి, శారదలు దురదృష్టవంతులనీ, పీనాసిపీచులని జోకులు వేసుకున్నారు. ఇంతకీ విషయం ఇంట్లో చెప్పాలా వద్దా అని ఎటూ తేల్చుకోలేక రెండు గ్రూపులుగా విడిపోయి కొంతమంది చెప్పాలనీ, మరికొంతమంది సామాను వచ్చేవరకు చెప్పకుండా సడెన్ సర్‌ప్రైజ్ చేద్దామని వాదించుకున్నారు.

***

తెల్లగా తెల్లవారింది.

రోజుకన్నా ఇంకొంచెం త్వరగా మహిళామణులు గుమిగూడారు.


"ఆ అమ్మాయిలు వర్ణించినంత గొప్పగా లేదు టీపొడి. ఎంత వేసినా చిక్కదనమేలేదు. మా ఆయన అయితే టీ బాగాలేదు అని తాగకుండానే వదిలేసాడు" అంది నీలిమ.

తమ భర్తలు తిట్టారని కొందరు, డబ్బులిచ్చినట్లు చెప్పలేదని కొందరు తమ అనుభవాలు చెప్పుకున్నారు.

"వాళ్లిచ్చిన రసీదు, కార్డు మా ఆయన చూసారు. దానిమీద వాళ్ల ఫోన్

## కోర్టుకెక్కుతున్న గ్రహశకలం!

అమెరికాలోని వర్జీనియాలోని ఒక మెడికల్ ఆఫీసులో జనవరి 18వ తేదీన సీలింగ్‌ను చీల్చుకుంటూ టెన్నిస్ బంతి అంత గ్రహ శకలం వచ్చి పడింది. తరచుగా భూమిమీద అనేక గ్రహ శకలాలు పడుతుంటాయి. వాటిని పరిశోధనా సంస్థలకి అమ్మి కొందరు డబ్బు చేసుకోవడం అమెరికాలో తరచూ జరుగుతూ ఉంటుంది. అదే విధంగా ఆ మెడికల్ ఆఫీసును



అద్దెకు తీసుకున్న డాక్టర్ మార్కొగాల్లినీ, ఫ్రాంక్ సియాంపీలు ఆ గ్రహ శకలాన్ని స్మితిసోనియం అనే పరిశోధన సంస్థకి ఐదువేల డాలర్లకి అమ్మేసారు. వారేమో భద్రత కోసం దాన్ని నేషనల్ సైన్స్ మ్యూజియంకి పంపారుట. ఈ సంగతి తెలిసిన ఆ ఇంటి యజమాని తన ఇంట్లోకి వచ్చి పడిన సంపద (అమెరికా చట్టం ప్రకారం) తనకే చెందుతుందని, ఇప్పుడా శకలాన్ని తనకి ఇప్పించాలని ఆ డాక్టర్లకు నోటీసులిచ్చాడు. అయితే వర్జీనియా స్టేట్ చట్టాల ప్రకారం అలాంటి సంపదలు అద్దెకున్నవాళ్లకి చెందుతాయని లాయర్లు కొందరు అంటున్నారు. ఈ చిక్కు సమస్య కోసం ఇప్పుడంతా కోర్టుకెక్కేలా ఉన్నారుట.

**-తటవర్తి**



నెంబర్ ఎక్కడాలేదన్నారు. ఆ అమ్మాయి ఫోన్ చేసి ఇస్తే మనం మాట్లాడా ముగానీ నెంబర్ వాళ్ళివ్వలేదు. నెంబర్ తీసుకోవాలని మనకు తోచలేదు. వాళ్ల మాటల గారడిలో పడి మనం మోసపోలేదుకదా'' అంది సరళ దిగులుగా. ఆమె ఏకంగా ఆశకొద్దీ మూడువేలు కట్టేసింది ఎక్కువ సామానుల కోసం.

"అలా ఎందుకు అనుకోవాలి? రెండువారాలు టైమిచ్చారుకదా. ఆ అమ్మాయిలు మోసకత్తెల్లా లేరు. అన్నమాట ప్రకారం సామాను వస్తాయనే ఆశిద్దాం'' అని పైకి అంటున్నా ఒక్కొక్కరికీ మనసులో అనుమానం, భయం మొదలయ్యాయి.

***

వారి జీవితంలో రెండువారాలు అత్యంత భారంగా, కాలం ఆగిపోయిందన్నంత నెమ్మదిగా గడిచాయి.

వారు ఎదురుచూసిన రోజు రానే వచ్చింది.

ఉదయం నుండి గోవిందా కంపెనీ వారు చేసే ఫోను కోసం, వారు పంపే సామానుకోసం ఒక్క క్షణం కుదురుగా నిలవక ఇంట్లోకి, బయటకీ కాలుగాలిన పిల్లుల్లా పచార్లు చేస్తూనే ఉన్నారు. మధ్యాహ్నం గడిచిపోయి సాయంత్రం అవుతున్నా ఎవరి జాడలేదు.

తాము పూర్తిగా మోసపోయామన్న విషయం గ్రహించుకుని పాలిపోయిన మొహాలతో డీలాపడి కూర్చున్నారు.

***

రోజులు గడుస్తున్నా అమ్మాయిల జాడగానీ, వస్తువుల జాడగానీ లేనే లేదు. అంత తక్కువ డబ్బుతో ఖరీదైన వస్తువులు స్వంతం చేసుకోవాలనే అత్యాశకు పోయి పోటీలు పడి మరీ వారి మాయమాటలు నమ్మేసి నెత్తికి కుచ్చుటోపీ తగిలించుకున్నారు.

తాము దాచి పెట్టుకున్న అన్నిరకాల డబ్బులు అతి తెలివితో పోగొట్టుకున్నారు.

ఈసారి ఎవ్వరైనా సేల్స్‌మేన్ లోపలకు వస్తే నీ ఉద్యోగం పీకి పారేస్తామని వాచ్‌మెన్‌కి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

రొటీన్‌గా అందరూ మాట్లాడుకుంటున్నా తమ తెలివితక్కువతనానికి చింతిస్తూనే వున్నారు.

అయితే కొసమెరుపుగా ఎవరూ ఊహించని అద్భుతమైన సంఘటన ఒకటి జరిగింది. చాలారోజుల తరువాత తిరిగి ఆ అపార్టుమెంటులో సందడి నెలకొంది.

ఆ రోజు ట్రాన్స్‌పోర్టుకి డబ్బు కడితే కావాల్సిన వస్తువులు ఇస్తామని ఆ అమ్మాయి చెబుతుంటే శారదకి ఇదంతా బోగస్ అనిపించింది. తను వద్దని వారిస్తున్నా వినిపించుకోకుండా ఎగతాళి చేసారు.

ఏదో ఆలోచన రావడంతో శారద తన సెల్‌ఫోనుతో ఆ అమ్మాయిల ఫోటో తీసింది.

ఈ విషయం ఎవరూ గమనించనేలేదు. ఇక ఆలస్యం చేయకుండా శారద ఆ ఫోటోలు చూపించి జరిగిన విషయం వివరిస్తూ కంప్లయింట్ ఇచ్చింది.

గతంలో కూడా ఈ స్కీముకి సంబంధించిన కంప్లయింట్ వచ్చినా ఆధారాలు లేక ఏమీ చేయలేకపోయిన పోలీసులు ఈసారి శారద తీసిన ఫోటోల సహాయంతో ఆ అమ్మాయిలను, వారి వెనుక వున్న ముఠాను వలవేసి పట్టుకున్నారు.

ఆ తరువాత వారివద్ద ఉన్న రసీదుల ప్రకారం ఎవరి డబ్బులు వారికి తిరిగి రావడం నమ్మశక్యంకాని విషయంగా ఉంది.


శారద గురించి ఎగతాళి చేసినవారు ఆమెనొక హీరోయిన్‌లా చూడసాగారు. తమ డబ్బు తమకి ఇప్పించినందుకు పొగడ్తలతో ఆమెను ముంచెత్తసాగారు. ఇంకెప్పుడూ తెలివితక్కువ స్కీముల జోలికి వెళ్లమని లెంపలేసుకున్నారు.

అయితే లక్ష్మి వారిని అంత తేలిగ్గా వదలలేదు. అవకాశం దొరికినప్పుడల్లా వారిని ఉడికిస్తూనే వుంది.

'భలే మంచి చౌక బేరం... చేయి జారిపోయింది కదూ పాపం' అంటూ ఆటలు పట్టిస్తూనే వుంది.

మొత్తానికి ఆ అపార్టుమెంటువారికి సేల్స్‌మెన్ల బెడద వదిలినందుకు మగవారు నిశ్చింతగా ఉన్నారు.

★



## మంచి కథలు రావడంలేదు

కమల్ హాసన్ కూతురు శృతి అటు హీరోయిన్‌గా ఇటు సంగీత దర్శకురాలిగా తన ప్రయత్నాలు తను చేస్తోంది. హిందీలో ఆమె నటించగా ఒక్క సినిమా రిలీజ్ అయింది. తమిళం, తెలుగులో ఒక్కో సినిమా చేస్తోంది. అయితే ఆమెకి నచ్చేంత గొప్ప కథలతో సినిమా చాన్సులు రావడం లేదని వాపోతోంది శృతి. చాలా ఆఫర్లు వస్తున్నాయి. కానీ కథలు బొత్తిగా బావుండడం లేదట. ఇలా బాలేవని వచ్చే అవకాశాలన్నింటినీ తిరస్కరిస్తే ముందు ముందు కష్టమైపోదా అని శృతి తీరుకు ముక్కున వేలేసుకుంటున్నారు.

